www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 25 ఫిబ్రవరి 2023
5
అన్నమయ్య

ఎన్నికల అబ్జర్వర్‌తో కలెక్టర్, ఎస్‌పి భేటీ

ప్రజాశక్తి-రాయచోటి

ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్‌గా నియమితులై జిల్లాకు విచ్చేసిన సీనియర్ ఐఎఎస్ అధికారి భాస్కర్ కాటమనేనికి కలెక్టరేట్లో స్వాగతం పలికిన కలెక్టర్ గిరీష పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ఒ సత్యనారాయణలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని భాస్కర్ కాటమనేని ఆదేశించారు.

అబ్జర్వర్ భాస్కర్‌తో సమావేశమైన కలెక్టర్, జెసి, ఎస్‌పి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఏకగ్రీవం!

- పరిశీలనలో ప్రత్యర్థి నామినేషన్ తిరస్కృతి
- వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థికి లైన్ క్లియర్
- వైసిపి శ్రేణుల్లో తొలగిన టెన్షన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం దిశగా సాగుతోంది. నామినేషన్ గడువు చివరి రోజున వైసిపి అభ్యర్థి మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి ప్రత్యర్థిగా పోటీ చేయడానికి ఒక నామినేషన్ దాఖలైంది. 24 గంటల్లోపే మరుసటి రోజైన శుక్రవారం నిర్వహించిన స్క్రూటినీలో ప్రత్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడం అనుమానాలకు తావిస్తోంది. ఎమ్మెల్సీ పదవి దక్కించుకోవాలనే ఉద్దేశంతోనే నామినేషన్‌లు దాఖలు చేయడం సహజం. కానీ ఇంతటి స్వల్ప సమయంలోనే ప్రత్యర్థి పోటీ చేయడానికి విముఖత వ్యక్తం చేయడం వెనుక దాగిన రహస్యంలోని మర్మమేమిటో తెలియడం లేదు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ప్రలోభపూరిత ఏకపక్ష ఎన్నికల రాజకీయ పరిశీలకుల నుంచి విమర్శల వర్షం కురుస్తోంది. ఏకగ్రీవ, ఏకపక్ష స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక పరిస్థితుల నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం కావడం అనివార్యంగా మారనున్నట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి తన నామినేషన్ పరిశీలన రోజున తిరస్కరణ కావడం పట్ల ఆసక్తి కనబరచకపోవడం గమనార్హం. వైసిపి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి గెలుపునకు లైన్‌క్లియర్ అయినట్లు తెలుస్తోంది. 2017 నాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మెజార్టీ మద్దతు కలిగిన వైసిపి అభ్యర్థి వైఎస్ వివేకా నందరెడ్డి ఓటమి పాలైన సంగతి తెలిసిందే. టిడిపి అభ్యర్థి బి.టెక్ రవి గెలుపునకు అవలంభించిన పద్ధతులు సంచలనాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. 2017 నాటి టైమ్ క్యాలెండర్ ప్రజల స్మృతిపథంలో నుంచి తొలగకమునుపే 2023 స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం దిశగా నడవడం చర్చనీయాంశంగా మారింది. వైసిపి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతుండడం గమనార్హం.

నామినేషన్లు పరిశీలిస్తున్న కడప జిల్లా జెసి సాయికాంత్‌వర్మ

పోలీస్, సెక్టోరియల్ అధికారులదే కీలక పాత్ర : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

పోలీస్, సెక్టొరల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి కేంద్రాలలోని సౌకర్యాలను పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీష్ పోలీస్, సెక్టొరల్ అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి పోలీస్, సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష్ మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దామని, ఎన్నికలలో పోలీస్, సెక్టొరల్ అధికారుల పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి కరెంట్, టాయిలెట్స్, ఫర్నిచర్, ర్యాంపులు తదితర సౌకర్యాలను గుర్తించాలని సౌకర్యాలు లేని చోట సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్, సెక్టోరియల్ అధికారులు, స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎన్నికల విధులలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. వల్నరబిలిటి, క్రిటికల్, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల రిపోర్టు యుద్ధ ప్రాతిపదికన పంపాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఓటర్ల పై అధికంగా ప్రభావం చూపే వల్నరబిలిటి (సమస్యాత్మక) ప్రాంతాలను పోలీసుల సహకారంతో గుర్తించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల రూట్లను ముందుగానే చూసుకోవాలన్నారు. పోలింగ్ కు ముందు రోజు మెటీరియల్ పంపిణీ, సెక్యూరిటీ ఎక్కడ ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల విధులలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ సిబ్బందిని 10 శాతం రిజర్వ్ పెట్టుకొని, అవసరం ఉన్నచోట వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రం వంద మీటర్ ల పరిధిలోపు ఎవరికి అనుమతి ఇవ్వకూడదన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో గతంలో జరిగిన సంఘటనలు, బైండోవర్ వివరాలను స్థానిక పోలీసు అధికారులను సంప్రదించి తెలుసుకోవాలన్నారు. సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

ఎమ్మెల్సీ ఎన్నికలలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. అధికారులందరూ ఎన్నికలను సీరియస్‌గా తీసుకొని పనిచేయలన్నారు. పోలీస్, అధికారులు సమన్వయంతో పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. బైండోవార్స్, గత ఎన్నికలలో జరిగిన సంఘటనలు, అటువంటి వాటి మీద ప్రత్యేక నిఘా ఉంచి, ముందస్తుగా పోలీస్ పికెటింగ్ పకడ్బందీగా చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్డీఓలు, డీఎస్పీలు, పోలీస్, సెక్టోరియల్, తదితరులు అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయం జరిగిందనీ, సంక్షేమ పథకాలు, సబ్సిడీలపై కోతలు విధించి ప్రజలపై అదనపు భారాలు వేసిన బిజెపిని ప్రజలంతా వ్యతిరేకించి సాగనంపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బెంగళూరు బస్టాండ్ కూడలి వద్ద కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా, సంక్షేమ పథకాలు, సబ్సిడీలపై కోతలు విధించి ప్రజలపై అదనపు భారాలు వేసినందుకు, అదానీ అవినీతికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారీ కోతలు విధించిందని, ఎరువులపై సబ్సిడీలు తగ్గించి ధరలు పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో ఎరువులు అందక రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు రెట్టింపు అయ్యాయని, ఆత్మహత్యలు పెరిగాయని, కౌలు రైతులను కనీసం గుర్తించడానికి కూడా కేంద్ర ప్రభుత్వం నిరాకరించిందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకానికి ఈ బడ్జెట్‌లో భారీ కోతలు విధించారని, ఇది పేదల కడుపు కొట్టడం తప్ప మరేమీ కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను ఎత్తివేశారని, బడ్జెట్‌లో సంక్షేమ నిధులు తగ్గిపోయాయని, ప్రజాపంపిణీ ద్వారా సరఫరా అయ్యే సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేశారని వివరించారు. ధరల పెరుగుదలతో సతమతమవుతున్న జనానికి మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా ఈ బడ్జెట్ భారాలు కోలుకోలేని దెబ్బతీస్తాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరించడమే కాకుండా విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు కాలేదని, కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు నామమాత్రంగా నిధులు విడుదల చేసినా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వకపోగా పుండుపై కారం చల్లినట్లుగా తుంగభద్ర కెనాల్స్ కింద నీటి సరఫరాను దెబ్బకొట్టే కర్ణాటకలోని అప్పర్ భద్రకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం దారుణం అన్నారు. ఆంధ్ర, కరా?టకల మధ్య విద్వేషాలు పెంచి రానున్న కర్ణాటక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుయుక్తులు పన్నిందని ఆరోపించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపలేదని, కడప ఉక్కు, రాజధాని నిర్మాణం, పోలవరానికి నిధులు ఇవ్వకుండా బిజెపి రాష్ట్రం పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అదానీ కుంభకోణం అంతర్జాతీయంగా భారతదేశానికి తలవంపులు తెచ్చిందని, చిన్న మదుపుదార్లు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసిని ముంచేశారని తూర్పారపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తుల్ని, ప్రకృతి వనరుల్ని అదానీపరం చేస్తుండడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నదని పేర్కొన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అదానీ అవినీతికి వ్యతిరేకంగా ముందుకు రావాలని కోరారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా పార్లమెంటులో రాష్ట్రానికి చెందిన సభ్యులు నోరెత్తడం లేదని, రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టడం పట్ల సిపిఎం తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రం హక్కుల సాధనకోసం కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఎ.వెంకటేష్, రెడ్డిప్రసాద్, చంద్రశేఖర్, ఛాంద్‌బాష, శివయ్య, పవన్ పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బడ్జెట్లో రాష్ట్రానికి కోతలు విధించి ద్రోహం చేసిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని టోల్గేట్ సెంటర్ వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహం ముందు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కర్రతోటిహరి నారాయణ, ముత్యాల శ్రీనివాసులు, సురేంద్ర, శ్రీనివాసులురెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి డి.జయచంద్ర, సిఐటియు ఓబులవారిపల్లి మండల కార్యదర్శి కె.వెంకటరమణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగిపోగు పెంచలయ్య. ఎస్ఎఫ్ఐ కోడూరు మండల అధ్యక్షులు, జి.సందీప్, కార్యదర్శి. ఆర్ జగదీష్, వంశి పాల్గొన్నారు.

మదనపల్లె : ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

రైల్వేకోడూరు : నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-రాయచోటి

ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఫ్యామిలీ డాక్టర్, అనీమియా, తదితర అంశాలపై వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి ముంగిటకే వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పకడ్బందీగా అమలయ్యేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. డాక్టర్లు ఇంటిదగ్గరకు వెళ్లి రోగులకు వైద్య సేవలు అందిస్తే వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. డాక్టర్లు గ్రామీణ ప్రాంత ప్రజల ఇంటి ముంగిటకు వెళ్లి వైద్య సేవలు అందించాలన్నారు. డాక్టర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సాధారణ ఆరోగ్య సమస్యలు, గర్భిణులు, బాలింతలు, శిశువులకు, రక్త హీనత ఉన్న వారికి, షుగర్ వ్యాధి గ్రస్తులకు, కిడ్నీ సమస్య ఉన్న వారికి మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. రక్తహీనత లోపం ఉన్న గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి సరైన వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనత నివారణకు కృషి చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు అనీమియా బారిన పడకుండా ఉండేందుకు, మంచి పౌష్టికాహారం తీసుకునే టట్లు వారికి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో కంటి వెలుగు స్క్రీనింగ్ పక్కగా జరగాలన్నారు. 45 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి డాక్టర్లు తప్పకుండా కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అవసరమైన వారికి ఉచితంగా కంటి అందాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, మెడికల్ ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-రాయచోటి

న్యాయవాదులపై భౌతిక దాడులకు పాల్పడుతున్న దుర్మార్గులపై చర్యలు తీసుకోవడమే కాక న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని అఖిలభారత న్యాయవాదుల సమైక్య అన్నమయ్య జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. శుక్రవారం రాయచోటి కోర్టులో విధులు బహిష్కరించిన అనంతరం వారు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద సమావేశం ఏర్పాటు చేసి న్యాయవాదులపై జరిగే దాడులను వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా కోర్టులో విధులకు హాజరై తిరుగు వస్తున్న సందర్భంలో న్యాయవాది సురేంద్రపై ప్రత్యర్థులు దాడి చేయడం క్షమించాలని నేరమని పేర్కొన్నారు. ఇదే తరహాలో జోధ్పూర్‌లో మరొక న్యాయవాదిపై విచక్షణ రహితంగా దాడి చేసి హత్య చేయడం దారుణమ న్నారు. దేశవ్యాప్తంగా న్యాయ వాదులపై దాడి చేసిన కేసులు వందల సంఖ్యలో ఉన్నాయని న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తేవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అఖిల భారత న్యాయవాదుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఈశ్వర్, జిల్లా న్యాయ వాదుల సమితి అధ్యక్షులు రాజకుమార్ రాజు, టివి.రమణ, హుమాయూన్ బాషా, రవిశంకర్ ఐఎఎల్ నాయకులు ఖాదర్బాషా, నిరంజన్ పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

కడప అర్బన్: హ్యాండ్ బాల్ క్రీడలో రాణించే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కె.చిన్నపరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని డిఎస్ఎ క్రీడామైదానంలో జిల్లాస్థాయి జూనియర్ బాలుర విభాగం ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హ్యాండ్ బాల్ క్రీడను ఉన్నతస్థానానికి తీసుకువెళ్తామన్నారు. రాష్ట్రంలోనే జిల్లా జట్టు ఆదర్శంగా ఉండేలా ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. శిలకు ఉలిదెబ్బ తగిలితేనే శిల్పమవుతుందని, క్రీడాకారుడు చెమటోడిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులకు ఈనెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తుదిజట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు కె. ఎన్. సమరనాథరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో క్రీడలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన పోతుల ట్రస్టు చైర్మన్ పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు క్రీడాదుస్తులు, రవాణా ఛార్జీలు చెల్లించనున్నట్లు ప్రకటించారు. జియోన్ వ్యాయామ కళాశాల వ్యవస్థాపకులు కె. రాజారత్నం ఐజాక్ మాట్లాడుతూ క్రీడల్లో జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని సూచించారు. అంతర్జాతీయ హ్యాండ్ బాల్ క్రీడాకారుడు సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఆట పట్ల అంకితభావం, సాధించాలన్న తపన, క్రమం తప్పని సాధన ఉత్తమ క్రీడాకారులుగా రాణించేందుకు దోహదం చేస్తాయన్నారు. జిల్లా హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి ఎ.సింధూరి మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు మార్చి 3, 4, 5 తేదీల్లో కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకుని ఎంపికలను ప్రారంభించారు. డిఎసి హ్యాండ్ బాల్ కోచ్ మునాఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. రాజశేఖర్, సీనియర్ క్రీడాకారులు సాయికిశోర్ రెడ్డి, శివప్రసాద్, రాజగోపాల్ రెడ్డి సెలక్షన్ కమిటీ సభ్యులుగా జిల్లా జట్టుకు ప్రాబబుల్స్ ఎంపిక చేశారు. కార్యక్రమంలో జియోన్ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ రోడా మెర్సీ, మన్సూర్ అలీఖాన్ పాల్గొన్నారు.

28న 'జానమద్ది' వర్ధంతి

ప్రజాశక్తి - కడప అర్బన్

సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో ఈ నెల 28న ఉదయం 10:00 గంటలకు గ్రంథాలయ వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి నవమ వర్ధంతి, స్మారకోపన్యాసం నిర్వహించనున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి ఆచార్య రంగ జనార్దన, సభాధ్యక్షులుగా యోగి వేమన విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, ప్రధాన వక్తగా పంచసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ (తిరుపతి), విశిష్ట అతిథులుగా శ్రీ అచలానంద ఆశ్రమం పీఠాధిపతులు స్వామి విరజానంద (బ్రహ్మంగారి మఠం), యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్, పూర్వ శాసనమండలి సభ్యులు పోచంరెడ్డి సుబ్బారెడ్డి, జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ పాల్గొంటారన్నారు.

అథ్లెటిక్ మీట్‌లో రాణించిన రామకృష్ణ, హుస్సేన్

కడప: విద్యుత్ సంస్థ ఇంటర్ సర్కిల్ అథ్లెటిక్ మీట్ -2022 లో ఈనెల 23, 24 తేదీల్లో నెల్లూరులో నిర్వహించారు. ఇందులో కడప ఆపరేషన్ సర్కిల్ నుంచి సబ్ ఇంజినీర్ రామకృష్ణ జావలిన్‌త్రోలో మూడవ స్థానం, డిస్కత్రోలో జెఎల్ఎం హుస్సేన్ రెండవ స్థానం దక్కించుకున్నారు.

రేపు నెలనెలా సీమ సాహిత్యం సదస్సు

ప్రజాశక్తి కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 117వ సదస్సును ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 117వ సదస్సులో 'విద్వాన్ గానుగపెంట హనుమంతరావు జీవితం - సాహిత్యం' అనే అంశంపై పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం (ప్రొద్దుటూరు) ప్రసంగిస్తారని తెలిపారు.

ఆదివాసి స్కూల్ పిల్లలకు చేయూత

ప్రజాశక్తి - కడప

ఝార్ఖండ్ రాష్ట్రంలో ఆర్గోల్ వంజా మేరీ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న మార్నింగ్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పిల్లలకు ప్రిన్స్ వంజా చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015 లో ఎవిఎం సంస్థ ఆదివాసి పిల్లల కోసం స్కూల్ నడుపుతోందని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతో కృషి చేసి పాఠశాలను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కరోనా కారణంగా ఎన్నో పాఠశాలలు మూతపడిన సమయంలో తమ సంస్థ ఆ విపత్తుని ఎదుర్కొని ఆదుకున్నామని పేర్కొన్నారు. మంచి విద్యను అందించడం తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇందుకు సహకరిస్తున్న ఎందరో దాతలకు తమ సంస్థ రుణపడి ఉందని నుకొంన్నారు. దాతలు మరింత సహృదయంలో ముందుకు వచ్చి సాయమందించాలని కోరారు. మరిన్ని సేవ కార్యక్రమాల ద్వారా తమ సంస్థ ముందుకెళ్తుందని ప్రిన్స్ వంజా అన్నారు. ఈ సందర్భంగా బడి పిల్లలకు లంచ్ బాక్సులు అందజేశారు. ఝార్ఖండ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సంగీత హోరో, ప్రధానోపాధ్యాయురాలు ఎమిలీ డాంగ్ , అధ్యాపకులు, పిల్లలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న రైతు తన్మయిరెడ్డి

నా పట్టా భూమిని చూపండి

- తహశీల్దారుకు రైతు వినతి

ప్రజాశక్తి-పీలేరు

2018లో తాను పట్టా పొందిన భూమి రికార్డుల పరంగా కొలిచి చూపాలంటూ బాధిత పట్టాదారు రైతు పి.తన్మయిరెడ్డి పీలేరు తహశీల్దారు జి.రవికి వినతిపత్రం సమర్పించుకున్నారు. శుక్రవారం ఆయన స్థానిక తహశీల్దారును కలిసి తన సమస్యను వివరించుకున్నారు. రైతు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పీలేరు మండలం, గూడరేవుపల్లి పంచాయతీ, సర్వేనెంబర్200/2లో డాటెడ్ ల్యాండ్‌గా ఉన్న 3.39 ఎకరాల భూమిని నాటి తహశీల్దారు, మదనపల్లి సబ్ కలెక్టరు, జిల్లా కలెక్టరు స్వయాన రికార్డులను పరిశీలించి, భూమి చూసి ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని, ఈ భూమిపై సర్వ హక్కులు తనకే ఉన్నాయంటూ 2018లో పట్టా భూమిగా క్రమద్దీకరించి ఇచ్చారని అన్నారు. ఇప్పుడు స్థానిక రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వ భూమి అంటూ తమ సర్వే నెంబరుతో సంబంధంలేకుండా 200/3లో 53 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందంటూ తన పట్టా భూమిలో సూచిక బోర్డు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. సంబంధిత భూమిలోని సూచిక బోర్డును తొలగించి తన భూమిని తనకు కొలిచి ఇవ్వాలని లిఖితపూర్వకంగా తహశీల్దారుకు విన్నవించుకోవడం జరిగిందన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మిషన్ ఫర్ విజన్, సాయి మాతా సేవా ట్రస్టు, శంకర్ నేత్రాలయ చెన్నై, జిల్లా అంధత్వ నివారణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మదనపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ నెల 26వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు చిన్ని తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కంటికి సంబంధించిన అన్ని రకముల వ్యాధులకు వచ్చి తమ సమస్యలను పరీక్షించుకోవలసినదిగా కోరారు. ప్రతినెలా ఈ శిబిరం నాల్గవ ఆదివారం కొనసాగుతుందని వివరించారు. ఉచిత కంటి వైద్య శిబిరం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని పేర్కొన్నారు. అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆడ పిల్లలను విద్యా వంతులుగా తీర్చిదిద్దాలి

- ఐసిడిఎస్ ఆర్‌జెడి పద్మజ

ప్రజాశక్తి-పీలేరు

సమాజంలో ఎవరూ ఆడపిల్లలని నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ వారిని మంచి విద్యా వంతులుగా తీర్చిదిద్దేలా అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిదండ్రులను చైతన్య పరచాలని ఐసిడిఎస్ ఆర్‌జెడి పద్మజ తెలిపారు. స్థానిక సిఎల్ఆర్‌సి సమావేశ మందిరంలో పీలేరు, కెవి పల్లి మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లను తమ సొంత బిడ్డల్లా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉంటుందని పేర్కొన్నారు. వారికి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారం పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని సూచించారు. గర్భవతులకు వైఎస్ఆర్ కిట్లను అందజేస్తూ వారిలో రక్తహీనత సమస్యను అధిగమించడానికి కృషి చేయాలని చెప్పారు. ముఖ్యంగా ఆడపిల్ల సంతతి తగ్గకుండా తల్లులకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. అన్నమయ్య జిల్లా ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ ధనలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని తొమ్మిది ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,275 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయని, వాటి ద్వారా 0-6 ఏళ్ళ మధ్య వయస్సు చిన్నారులు 1,09,708 మంది, 10,575 మంది గర్భవతులు, 10,752 మంది బాలింతలకు పౌష్టికాహారం అందుతోందని పేర్కొన్నారు. తమ కేంద్రాల్లోని 1,09,708 మంది చిన్నారుల్లో 35 వేల మంది పిల్లలకు 32 శాతం ఆధార్ అనుసంధానం ప్రక్రియ పూర్తైందని, మిగిలిన వారిని కూడా మార్చి 15 లోగా ఆధార్ అనుసంధానం పనులను 100 శాతం పూర్తి చేయాలని కార్యకర్తలను ఆదేశించారు. కేంద్రాలకు సరఫరా అవుతున్న బియ్యం, పప్పు, నూనె, పాలు, వైఎస్ఆర్ కిట్లు, కోడుగ్రుడ్ల నాణ్యత, పరిమాణం వాటి గడువు తేదీలను పరిశీలించి తీసుకోవాలని చెప్పారు. కేంద్రాలకు సరఫరా చేసే వస్తువులు, పదార్థాల్లో లోపం ఉంటే వాటిని వెనక్కు పంపి ఫిర్యాదులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో డిఎల్‌పిఒ సిహెచ్ నారాయణ, చిన్నగొట్టిగల్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ సి.రాజమ్మ, సూపర్‌వైజర్లు స్వరూప, అక్కయ్యమ్మ, ఉమ, స్వర్ణ, శాంత, సర్తాజ్, అన్నపూర్ణ, వైఎస్ఆర్‌టియుసి అనుబంధ సంఘమైన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చిన్నమ్మ, జిల్లా అధ్యక్షులు చిన్నయల్లప్ప, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ ఆర్‌జెడి పద్మజ

పాదయాత్రలో లోకేష్‌ను కలసిన పర్వీన్‌తాజ్

లోకేష్ పాదయాత్రలో పర్వీన్‌తాజ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యువగళం పేరిట టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర అశేష జనవాహిని మధ్య సాగుతోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్ఎం.పర్వీన్ తాజ్ పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన నారా లోకేష్ తో కలిసి ఈ పాదయాత్రలో తిరుపతి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఎస్ఎం.ఫర్వీన్‌తాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువగళానికి యువత, మహిళలు, రైతులు, కార్మిక, కర్షకులు ఇలా అన్నివర్గాల నుండి విశేష స్పందన లభిస్తోందన్నారు. పాదయాత్రలో ప్రజల సమస్యలను లోకేష్ నేరుగా తెలుసుకుంటున్నారని అన్నారు.

రోడ్డు ప్రమాదాలపై పోస్టర్ ప్రదర్శన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సమయం విలువైనదే కానీ..ప్రాణం అంతకంటే విలువైందని తెలియజేస్తూ పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు రోడ్డు ప్రమాదాలపై పోస్టర్ ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల ఎజిఎం రమణయ్య, ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సైన్స్ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకే పది అంశాలతో కూడిన పోస్టర్‌ను రూపొందించారన్నారు. ప్రధానంగా ట్రాఫిక్ సిగ్నల్స్‌పై, వాహనాలు నడుపు తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు చిత్రాల ద్వారా తెలియపరిచారని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్, సీటుబెల్ట్ తప్పసరిగా ధరించాలని, అధిక వేగంతో వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవుతారని విద్యార్థులు చిత్రాల ద్వారా చక్కగా అవగాహన కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

27న కలికిరి మండల సమావేశం

కలికిరి : ఈనెల 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ గంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపిపి నూర్జహాన్ ఆదేశాలు మేరకు ఈనెల 27 సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రభుత్వ అధికారులు తమ తమ శాఖ పరిధిలోని పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు.

దర్గాను సందర్శించిన వక్ఫ్‌బోర్డు చైర్మన్

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని పెద్దపాళ్యంలో ఉన్న హజరత్ సులేమాన్ దర్గాను జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కరీముల్లా సందర్శించారు. శుక్రవారం సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మసీదు కమిటి సభ్యులు, గ్రామస్తులు ఆయనను సన్మానించారు. మసీదు అభివృద్ధి కొరకు సహకరించాలని విన్నవించారు. ఎన్నికల నియమావళి కారణంగా తాము ఎలాంటి ప్రతిపాదనలు పంపలేమని, ఎన్నికలు ముగిసిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటి సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని వైసిపి కార్యాలయంలో శనివారం 9 గంటలకు గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైసిపి కన్వీనర్ గడికోట జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, ఐప్యాక్ టీం పాల్గొంటారని పేర్కొన్నారు. మండలం లోని వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎంపిటిసిలు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ బూత్ కన్వీనర్లు, గృహ సారథులు గ్రామ వాలంటీర్లు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

యానాదులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-రామాపురం

యానాదుల సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని జడ్‌పిటిసి మాసన వెంకటరణ తహాశీల్దార్ సత్యానందంను కలసి విన్నవించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కల్పనాయుని చెరువు పంచాయతీ మూలపల్లి ఎస్‌టి కాలనీ రైతులు శుక్రవారం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిని కలసి తాము సాగు చేసుకున్న భూములు వేరే వారి పేరుతో ఆన్‌లైన్ చేయించుకున్నారని, మాకు న్యాయం చేయాలని కోరారని అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తహాశీల్దార్‌ను కలసి యానాదుల భూ సమస్యను పరిష్కరించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ వ్యవహారంపై విచారించి మూలపల్లి వాసులకు తగిన న్యాయం చేస్తామని తహాశీల్దార్ హామీనిచ్చారని తెలిపారు.

యువగళం పాదయాత్రను విజయవంతం చేద్దాం

పీలేరు: నియోజకవర్గంలో మూడు రోజుల పాటు జరగనున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్రలో నియోజక వర్గ తెలుగు యువత పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని నియోజకవర్గ టిడిపి అనుబంధ సంఘం తెలుగు యువత విభాగం అధ్యక్షులు పి. మహేంద్ర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పీలేరు, కలికిరి, వాల్మీకిపురం మండలాల్లో వరుసగా మూడు రోజుల పాటు జరిగే పాదయాత్రలో అన్ని సంఘాలతో పరిచయం, ముఖాముఖి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అలాగే తమ తమ సమస్యలు విన్న వించు కోవచ్చని తెలిపారు. పాదయాత్రలో పాల్గొనే గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

తంబళ్లపల్లి : మండలంలోని మూలపల్లి బస్‌స్టాప్ సమీపంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం 5వ వార్షికోత్సవాన్ని పంచాలమర్రి, ఎర్రసానిపల్లి గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు ఆర్థిక సహాయంతో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. భజనా మండలి కళాకారుల ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది.

రాష్ట్ర స్థాయికి మొర్రాయపల్లె పాఠశాల ప్రాజెక్టు

చాపాడు : అజాదికా అమృత్ మహోత్సవ్ మైక్రో ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్స్ లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 4525 ప్రాజెక్టులు చేయగా అందులో మండల పరిధిలోని మొర్రాయపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయులుగా పని చేస్తున్న ఎం.నాగలక్ష్మి దేవి తయారుచేసిన 'బేసిక్ మ్యాథమెటిక్స్ అండ్ పర్మినెంట్ టిఎల్ఎం' ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైందని ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో 26 జిల్లాల నుండి వచ్చిన అన్ని ప్రాజెక్టుల నుంచి 15 ఎంపిక చేయగా వాటిలో ఈ ప్రాజెక్టు ఎంపికైందని పేర్కొన్నారు. నాగలక్ష్మి దేవి ఎంతో వినూత్నంగా ఆలోచించి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు నేడు మొదటి దశ పనులలో విద్యార్థులు ప్రాథమిక దశలో గణితంలో ఎదుర్కొనే కొన్ని సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి కిటికి నిర్మాణంతో పాటు ఎంతో చక్కటి ప్రాజెక్టును తయారు చేశారన్నారు. వృత్తి పట్ల అంకితభావం, నిబద్ధత అభినందనీయమని ఎంఇఒ అభినందించారు. ఈ ప్రాజెక్టు వీడియోను జిల్లాలోని అందరూ ఉపాధ్యాయులు చూసి మంచి రేటింగ్ ఇవ్వడం ద్వారా ప్రాజెక్టు నేషనల్ లెవెల్‌కు ఎంపిక అవుతుందని, అందుకు సహకరించాలని ఆయన సూచించారు.

ప్రజలకు భరోసా కల్పించడమే టిడిపి ధ్యేయం : ఆర్ఆర్

వైసిపి కార్యకర్తలను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న రమేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వైసిపి పాలనలో ఇబ్బందులను ఎదుర్కొంటున్న ప్రజలకు భరోసా కల్పించడమే తమ ధ్యేయమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండంలోని కుర్నూతల పంచాయితీ లో దిగువ వడ్డేపల్లె, ఎగువ వడ్డేపల్లె, పందిళ్ళ పల్లె పంచాయితీలో సోమలవాండ్లపల్లె, బూర్జుపల్లె, పెద్దపల్లె, పందిళ్ళ పల్లె, కొక్కంటివాండ్లపల్లె, కుప్పంవాండ్లపల్లె, శ్రీరామపురం, వడ్డేపల్లె, కోతలగుట్టపల్లె, నల్లగుండ్లపల్లె లలో నిర్వహించిన ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తాము కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి మొత్తం పది అంశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం చేపట్టిన గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడడంతో నాయకులు ముఖం చాటేస్తున్నారని ఆరోపించారు. 'రాష్ట్రానికి ఇదేం కర్మ, రచ్చబండ , కార్యక్రమాల ద్వారా తెలుగుదేశం పార్టీ ప్రజల్లోకి దూసుకుపోతుందన్నారు. ప్రజల పరిస్థితులు ప్రజలకు ఎదురవుతున్న ప్రధానమైన సమస్యల్ని తెలుసు కొని అవగాహన కల్పించి వాటిపై చర్చ జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. ప్రధానంగా ఆకాశంలో ధరలు, పేదలకు భయం, గుప్పెట్లో ఆడబిడ్డలు, నిరుద్యోగ యువత, భవిత చిత్తు, గిట్టని గిట్టుబాటు ధరలు, రైతన్నల ఆత్మహత్యలు, గుంతల మయమైన రోడ్లు, మన ఇసుక ఎక్కడికి వెళుతుందో జగన్ కే ఎరుక, నిధులు లూటీ, ప్రశ్నించిన వారిపై లాఠి, షాక్ కొట్టించే కరెంటు ధరలు, ఇలాంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతును చేస్తున్నామని చెప్పారు.

వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలు

కుర్నూతల వడ్డేపల్లెలో ఐదు కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలోకి రమేష్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరారు. పందిళ్ళపల్లె పంచాయతీ కోతలగుట్టపల్లె వైసిపి ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో టిడిపి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కుర్నూతల పంచాయతీ మాజీ సర్పంచ్ వేముల వెంకటరమణ, వేములమల్లిఖార్జున, క్రిష్ణనాగార్జున, యూనిట్ ఇన్‌ఛార్జ్ వెంకట్రామరాజు, మండ్ల రామాంజనేయులు, జొన్న రామ్మోహన్, శ్యామా, వేములగంగరాజు, వెంకటస్వామి, రేపన ఆనంద్ ,రేపన రెడ్డెయ్య, రమణ, వేముల చిన్న రమణ, హరినాధ , నాగరాజ బొట్టుడు, యోగేశ్వర పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : 'గడికోట'

ప్రజాశక్తి-చిన్నమండెం

గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు వచ్చే ఎన్నికల్లో మరల వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ ఆశయాలను ప్రజల చెంతకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులుపై ఉందన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అన్న నినాదంతో జగనన్న ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలన్నారు. గృహ సారథులు వారికి అందచేసిన సామగ్రిలోని బ్యాడ్జీలు ధరించి, వాలంటీర్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రతినిధులుగా పరిచయం చేసుకోవాలన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అని ముద్రించిన కరపత్రాలతో గత ప్రభుత్వంలో చంద్రబాబు ఏమి చేశారో, ఇప్పటి మన జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు ఏమి మేలు చేస్తున్నామో ఉంటుందని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలును, పార్టీ విధానాలును వివరించాలని సూచించారు. కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయ ప్రసాద్, చిన్నమండెం వైస్ ఎంపిపి ఎజాస్‌ఆలీఖాన్, రాష్ట్ర కురబసంఘము కార్పొరేషన్ డైరెక్టర్ పడిగల రమణ, కో-ఆప్షన్‌మెంబర్ గౌస్, మాజీసర్పంచ్ సలీం, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ చుక్క అంజనప్ప, ఎంపిటిసిలు రమేష్, వెంకటప్ప నాయుడు, శ్యామ్ చంద్ర, రెడ్డెప్ప, రమణ, శ్రీరాములు, శ్రీదేవి, కృష్ణమ్మ, సర్పంచులు లక్ష్మీ రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, దామోదర్, ఆఫ్రోజ్, మంజుల, జయమ్మ, దేవపట్ల నజీర్ బాషా,కళ్ళు రమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.**లక్కిరెడ్డిపల్లి :** లక్కిరెడ్డిపల్లె లో లక్కిరెడ్డిపల్లె మండల సచివాలయ వాలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ముఖ్యఅతిథిగా శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సచివాలయ వాలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు సమిష్టిగా జగన్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలును ఇంటింటా వివరించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు అందుతాయన్నారు. కిట్లలో ఏమేమి ఉంటాయో ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి సిడ్డక చంద్రారెడ్డి, సర్పంచ్ లు వెంకట నారాయణ రెడ్డి, రమణయ్య, వెంకట్రమన,జనార్దన్ రెడ్డి, గడ్డం ప్రభాకర్ రెడ్డి, మీరావలి, ఎంపిటిసిలు దస్తగిరి, జగన్ మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్‌నాయుడు, ఉప సర్పంచ్‌లు రాజారెడ్డి, సంజీవరెడ్డి, రఫీ, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, కొండ ప్రసాద్ రెడ్డి,దేవేంద్ర రెడ్డి, దుర్గయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు నన్నే సాబ్,చాన్ భాష, జాకీర్, బాబ్ జాన్, నాసిర్, అన్వర్ సాదత్, ఇస్మాయిల్, వార్డు మెంబర్ వరుణ్ కుమార్,బిసి సెల్ విజయ్ భాస్కర్, వైయస్సార్సీపి నాయకులు అంబాబత్తిన రమేష్, లల్లు యాదవ్, రెడ్డయ్యరాజు, దప్పేపల్లి సిద్ధారెడ్డి, అలిభాష, సెల్వరాజ్, సుబ్బరాయుడు, పురుషోత్తం, మాసుల్ సాబ్, శివమళ్ళప్ప నాయుడు, రవి ఆచారి, మధుసూదన్ రెడ్డి, బసయ్య, బలరాం రెడ్డి, భాస్కర్ రెడ్డి, రాంబసిరెడ్డి, హబీబ్, బూత్ కమిటీ కన్వీనర్లు, గ్రామ వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్ఐవి బాధితునికి టీకా వేస్తున్న నర్సు

హెచ్ఐవి బాధితులకు హెపటైటిస్ టీకాలు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లాలోని హెచ్ఐవి బారినపడి మందులు వాడుతున్న వారికి హెపటైటిస్-బి టీకాను వేయించుకోవాలని సూచించింది. శుక్రవారం కేంద్ర కారాగారంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, వివారణ విభాగం ఆధ్వర్యంలో హెచ్ఐవి మందులు వాడుతూ హెపటైటిస్-బి బారిన పడకుండా ఉన్నవారికి టీకా వేశారు. రెండు ఎఆర్‌టిసి సెంటర్లలో 1,744 మందికి టీకా వేశారు. కార్యక్రమంలో జైళ్లశాఖ డిఐజి రాహుల్, సూపరింటెండెంట్ ప్రకాష్, జిల్లా అదనపు వైద్యశాఖాధికారి డాక్టర్ ఎస్.కె.ఖాదర్‌వల్లి, కారాగార సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్, పిఒ మంజుల, డిపిఎం భాస్కర్, డిఐఎస్ ప్రసాద్, షామీర్‌బాష పాల్గొన్నారు.

స్థలం కబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి -చాపాడు

మండల కేంద్రమైన చాపాడు పోలీస్ స్టేషన్ సమీపంలో సర్వేనెంబర్ 105లో గల 2.83 ఎకరాలు స్థలాన్ని కబ్జా చేసేందుకు గ్రామానికి చెందిన చాపాటి హర్షవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగులపల్లి కి చెందిన నీలకంఠ రెడ్డి ప్రయత్నిస్తున్నారని జమ్మలమడుగుకు చెందిన కరణం శశికళ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొలంలో బోర్లు వేస్తే వాటిని గతంలో తొలగించారని, ప్రస్తుతం కంచె వేసేందుకు రాళ్లు ఏర్పాటు చేస్తే వాటిని పగులగొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్ చేసి చంపుతామని బెదిరిస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

పంట కాలువలోకి వ్యర్థ నీరు

ప్రజాశక్తి చాపాడు

మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లి పంచాయతీ ద్వారకానగరం వద్ద నున్న పంట కాల్వలోకి వ్యర్థ నీరు వచ్చి చేరింది. గ్రామ సమీపంలోని పాల కేంద్రం నుంచి వ్యర్థ నీరు వస్తుందని ప్రజలు వాపోయారు. పాల కేంద్రంలో శుభ్రం చేసిన వ్యర్థ నీటిని బయటకు వదులుతూ ఉండడంతో అవి కాలువలోకి చేరి కెసి కెనాల్‌లో కలుషితమవుతున్నాయి. గ్రామానికి మంచినీటి సరఫరా చేసే బోరు సమీపంలోకి ఈ నీరు వచ్చి చేరుతోందని, దీంతో తాగునీరు కూడా కలుషితమయ్యే ప్రమాదముందని స్థానికులు వాపోయారు. వ్యర్థ నీటి వల్ల దుర్వాసన వస్తోంది. ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి విడుదల చేసిన నీటిలో దుర్వాసన అధికంగా వస్తుండటంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మురుగునీరు పంట కాలువలోకి వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కల్తీ పెట్రోలు విక్రయిస్తే చర్యలు

వేంపల్లె : పెట్రోల్ బంకుల్లో వాహనాదారులకు కల్తీ పెట్రోలు, డీజిల్ విక్రయిస్తే అలాంటి పెట్రోలు బంకు యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలోని పులివెందుల రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకులో తహశీల్దారు తనిఖీలు చేపట్టారు. పెట్రోలు స్టాక్ వివరాలతో పాటు వాహన దారులకు విక్రయించే ధరలను నిర్వహకులతో అడిగి తెలుసుకున్నారు. అలాగే పెట్రోల్‌ను పరిశీలించారు. పెట్రోలు బంకుల్లో వాహనాదారులకు మౌలిక సదుపాయాలైన తాగునీరు, బాత్ రూమ్‌లు కచ్చితంగా ఉండాలని సూచించారు. గాలి మిషన్ కూడా ఉండాలని సూచి ంచారు. ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని సూచించారు. వాహనాదారులకు నాణ్యమైన పెట్రోలు, డీజిల్ విక్రయాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, విఆర్ఓలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్లలో..** మండల పరిధిలోని పొట్లదుర్తి, చిలమకూరు, ఎర్రగుంట్లలోని పెట్రోల్ బంకులను శుక్రవారం తహశీల్దార్ నాగేశ్వరరావు తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పెట్రోల్ బంకులను తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సబ్సిడీతో డ్రోన్‌లు మంజూరు

చాపాడు : వ్యవసాయంలో పెరుగుతున్న ఆధునికీకరణలో భాగంగా వచ్చిన డ్రోన్ లను రైతులకు సబ్సిడీతో పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. డ్రోన్ల ద్వారా క్రిమి సంహారక మందులు పంట పొలాలకు పిచికారి సులభంగా చేసుకోవచ్చని తెలిపారు. రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్లను రైతు సిహెచ్‌సి గ్రూపులకు 40 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తుందన్నారు. ఎజిబిఎస్, డిప్లొమా పూర్తి చేసిన వారికి 50శాతం సబ్సిడీతో మంజూరు చేస్తుందన్నారు. కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తథ్యం : పిసిసి

వేంపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న వ్యతిరేక విధానాల వల్ల నలిగి పోతున్న ప్రజలు కాంగ్రెసు పార్టీకి ఆకర్షణ అవుతున్నారని కాబట్టి కాంగ్రెస్ పార్టీకి రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో పూర్వ వైభవం రావడం తథ్యమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ 52 లోక్ సభ స్థానాల్లో గెలిచిందని చెప్పారు. ఇండియా టుడే - సి ఓటర్ తాజా సర్వే ప్రకారం ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ కు 191 స్థానాలు వస్తాయని తేలిందని చెప్పారు. దీని బట్టి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ గణనీయంగా పుంజుకొన్నట్లు తెలుస్తుందని చెప్పారు. రాష్ట్రంలో వైసిపి పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్నట్లు చెప్పారు. జనవరిలో ఐ ప్యాక్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్ర కేబినెట్‌లో ఉన్న 25 మంది మంత్రుల్లో 20 మంది ఓడిపోతారని చెప్పారు. 13 మంది మాజీ మంత్రుల్లో 11 మంది ఓడిపోతారని తేలిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రత్యేకహోదా, రాష్ట్ర అభి వృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీకి వైభవం వస్తుందని తులసిరెడ్డి ఆశా భావం వ్యక్తం చేశారు.

రేపు తేక్వాండో జిల్లా స్థాయి పోటీలు

పోరుమామిళ్ల టౌన్ : స్థానిక సిరి ఫంక్షన్ హాల్‌లో న్యూ ఆంధ్రప్రదేశ్ తేక్వాండో అసోసియేషన్ అధ్యక్షతన ఆదివారం జిల్లా స్థాయి సబ్ జూనియర్, కేడిట్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా తేక్వాండో ప్రధాన కార్యదర్శి నాయాబ్ రసూల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పకుండా వారి ఆధార్ కార్డ్, జనన ధృవీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు.

ఉపాధ్యాయులే కీలకం

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యాభ్యాసంలో వెనుకబడిన విద్యార్థుల్లో అభ్యసనను మెరుగుపరచడంలో ఉపాధ్యాయులే కీలకమని లిప్ మానిటరింగ్ అధికారి చెరుకూరి శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం వేంపల్లెలోని ఉర్దూ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రాక్టీస్ పిరియడ్ ఎలా నిర్వహించాలో అనే వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అందించే విద్యా బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వెనుకబడిన విద్యార్థులకు చదవడం, రాయడం వాటిపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. అభ్యసనను మెరుగుపరచడంలో ఉపాధ్యాయులు అశ్రద్ధ వహించవద్దని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఇఒ రవీంద్రనాయక్‌కు 'సర్దార్' అవార్డు

ప్రజాశక్తి-చక్రాయపేట

మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాయక్‌కు సర్దార్ వల్లభాయ్ పటేల్ అవార్డు లభించింది. విద్యా ప్రగతిలో విశేష సేవలం దించడం, అకడమిక్ స్టాండర్స్ పెంపుదల, డ్రాప్‌అవుట్ నివారణ, పిల్లల్లో పొదుపు, ఆరోగ్యం పెంపుదల, పచ్చదనం పరిశుభ్రత, క్రీడల్లో పురోగతి వంటి వాటిలో విశేష సేవ చేసినందుకు గానూ ఈ ఏడాది జనవరి 30న న్యూఢిల్లీలోని సెంట్రల్ గవర్నమెంట్ ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి పశుపతి కుమార్ చేతుల మీదుగా ఎంఇఒ అవార్డు స్వీకరించారు. ఈనేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ విజయ్‌కుమార్, డిఇఒ దేవరాజు ఆయన్ను అభినందించారు. అవార్డు రావడానికి సహకరించిన ఎంపీ అవినాష్‌రెడ్డికి, వై.ఎస్. కొండారెడ్డి, ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, అధికారులకు ఎంఇఒ కృతజ్ఞతలు తెలియజేశారు.

మాట్లాడుతున్న హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ శివయ్య

అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు : పీడీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేయాలని జిల్లా హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ శివయ్య ఎఇలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ డిఇ కార్యాలయంలో తంబళ్లపల్లి కురబలకోట, బి.కొత్తకోట, పెద్ద తిప్ప సముద్రం, మొలకల చెరువు, పెద్ద మండ్యం హౌసింగ్ ఎఇ, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారిగా ఇళ్ల నిర్మాణ పనులు, పూర్తయిన ఇళ్ల వివరాలను తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కృషి ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అనుమతించిందని అన్నారు. నాలుగు రోజుల్లో హౌసింగ్ ఎఇలు, స్థానిక సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ వాలంటీర్లు గృహ ప్రారంభాలను సమన్వయపరిచి అర్హులైన లబ్ధిదారులకు గుర్తించాలని తెలిపారు. లబ్ధిదారులకు పూర్తి వివరాలను ఆన్‌లైన్లో పొందుపరచాలని చెప్పారు. తమకు ఇల్లు మంజూరు కాలేదు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఇఇ శ్రీహరి, ఎఇ సుజాత, వెంకటరెడ్డి, లావణ్య, శ్రీనివాసులు, సోహెల్, సందీప్ పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు

గుండెపోటుతో రైతు పొలం వద్దనే మృతి చెందిన సంఘటన శుక్రవారం పిటియం మండలంలో జరిగింది. స్థానికులు,కుటుంబీకుల కథనం మేరకు పిటిఎం మండలం, కందుకూరు పంచాయతీ, నిలువరాతిపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులు(42) వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి పంటకు నీరందించడానికి కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ బోరు వద్దనే నిద్రించాడు. తెల్లవారిజామున రైతు శ్రీనివాసులుకు గుండెపోటు రావడంతో కుటుంబీకులు ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబం పెద్దదిక్కు చనిపోవడంతో వారి రోధనలు స్థానికులను కంటతడి పెట్టించాయి. గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-కలకడ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు.. మండలంలోని కోటగుడిబండకు చెందిన చిన్నకోట్ల వెంకటేష్ కుమారుడు చిన్నకోట్ల జయరాము తన ఎపి03ఎఎస్ 5637 నెంబర్ గల బజాజ్ డిస్కవర్ ద్విచక్ర వాహనంలో కలకడకు తన సొంత పనుల నిమిత్తం బయలుదేరినట్లు తెలిపారు. ఈ క్రమంలో మండలంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ముందు వెళుతున్న 6935 నంబరు గల ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిందన్నారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ తోటిపల్లికి చెందిన లక్ష్మయ్య కుమారుడు పాటూరు సురేంద్ర తన ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ కుడివైపుకు తిప్పడంతో వెనకనుంచి ద్విచక్ర వాహనంలో వస్తున్న జయరాము ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో జయరాముకు బలమైన రక్త గాయాలు కావడంతో పోలీసులు స్థానికుల సహాయముతో ప్రయివేట్ వాహనములో పీలేరుకు చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలలో ఉంచినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు చిన్నకోట్ల పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సునీల్ శశికుమార్ తెలిపారు. జయరాము మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ములకలచెరువు

కర్ణాటక మద్యం అమ్ముతున్న మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 15 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఇబి సిఐ మల్లిక తెలిపారు. ఎస్ఈబి సిఐ వివరాల మేరకు.. ములకలచెరువు మండలం పత్తికోట పంచాయతీ, చీటికివారిపల్లెలో కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందికి కలిసి దాడులు నిర్వహించమన్నారు. ఈ దాడుల్లో నాగమణి(34) అనే మహిళ నుంచి 15కర్ణాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకొని అరెస్టుచేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవ్వరైనా మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్యాయత్నం

నిమ్మనపల్లి : అనారోగ్యం భరించలేక మనస్థాపంతో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నిమ్మనపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని నాయునివారిపల్లెకు చెందిన జయచంద్ర(36) వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతనికి పలు ఆస్పత్రిలో చికిత్సలు అందించారు. అయినా ఆరోగ్యం మెరుగవకపోవడంతో జీవితం పై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల చికిత్సల అనంతరం బాధితుడు కోలుకుంటున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నిమ్మనపల్లి : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు. పోలీసుల వివరాల మేరకు..వెంగళవారికురవపల్లెకు చెందిన గంగయ్య కుమారుడు పాలేటి ప్రసాద్, అనుమతులు లేకుండా నిమ్మనపల్లె పంచాయతీ బోడెబండ సమీపం నుంచి అక్రమంగా ఇసుకను తీసుకొని వస్తుండగా విచారించినట్లు తెలిపారు. ఇసుక తరలింపునకు అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడు ప్రసాద్ పై హెడ్ కానిస్టేబుల్ రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలు

పెద్దమండ్యం: మండల కేంద్రమైన కుశావతినది వద్ద పాల వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు జరిగిన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు..పాపేపల్లి పంచాయతీ వెలిగింటి వారిపల్లికి చెందిన అక్కులప్ప, వెంకటరమణ, వెంకటప్ప పనిమీద చిన్నమండ్యంకు వెళ్లి తమ స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా పెద్దమండెం కుశావతినది దగ్గర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గాలివీడు మండలం నుండి మదనపల్లెకు పాలు తీసుకొని పోతున్న వాహనము ఢీకొనడంతో అక్కులప్పకు, వెంకటరమణకు కుడి కాలు పూర్తిగా విరిగి పోయిందని, వెంకటప్పకు బలమైన గాయాలైనట్లు తెలిపారు. గాయపడిన వారిని 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదంలో గాయపడ్డ బాధితులు